క్లుప్తంగా

రూ.42 లక్షలతో జోడు లింగాల ఆలయ రథం


రథం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న శివశంకర్ శాస్త్రి

కూడేరు: దక్షిణ భారత దేశంలో ప్రఖ్యాతిగాంచిన శివాలయాల్లో ఒక్కటిగా కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం నిలిచింది. ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా రథోత్సవానికి ఉపయోగించే రథం పాతబడి దెబ్బతింది. ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన కోకా బ్రదర్స్ నూతనంగా రథాన్ని తయారు చేయించేందుకు ముందుకొచ్చారు. బుధవారం రథం తయారీ పనులను ప్రారంభించారు. వేద పండితుడు శివశంకర్ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా రథ నిర్మాణ దాతలు కోకా బ్రదర్స్ మాట్లాడుతూ.. జోడులింగాల భక్తులు, కూడేరు గ్రామ ప్రజలు, పెద్దల సహకారంతో సుమారు రూ.42 లక్షల వ్యయంతో రథాన్ని తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. తయారు పనులను వేగవంతంగా చేయించి వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయించేలా చర్యలు చేపడతామన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ


విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఉరవకొండ: ఈనెల 24న పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉరవకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థినులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాన్యశ్రీ, అమృతలక్ష్మి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయురాలు సునీత పర్యవేక్షణలో రైతులు విద్యుత్ షాక్‌కు గురికాకుండా తయారుచేసిన పరికరం (స్మాట్ అగ్రికల్చర్ యాప్) ఉత్తమ ప్రదర్శనగా నిలిచి మొదటి బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు సునీత, సత్తా చాటిన విదార్థినులను అభినందించారు.

డ్రోన్ ఆవశ్యకత గుర్తించాలి


నింబగల్లులో డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ, హెచ్‌ఓలు

ఉరవకొండ: రైతులు డ్రోన్ ఆవశ్యకతను గుర్తించి తక్కువ నీటితో ఎక్కువ ఎకరాలను తడపవచ్చు అని మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్, హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో రైతు గుడిపూటి తిమ్మప్ప పొలంలో డ్రోన్ వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ, హెచ్‌ఓలు మాట్లాడుతూ.. డ్రోన్ టెక్నాలజీను రైతులు వినియోగించుకుంటే కూలీల ఖర్చు పూర్తిగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. డ్రోన్‌లతో అన్నీ రకాల మందులను కొన్ని గంటల్లోనే పిచికారీ చేయవచ్చని పేర్కొన్నారు. పప్పుశనగకు పచ్చపురుగు, లద్దెపురుగు ఆశించే అవకాశాలు ఉండటంతో మందులు వాడాని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి నెట్టికంఠయ్య మాట్లాడుతూ.. ఎండు మిరప పూతదశలో ఉందని తెలిపారు. నల్లనల్లి, ఎర్రనల్లి తెగులు సోకకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చరా?


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా సూపర్ సిక్స్ హామీలు నేరవేర్చకుండా ప్రజలను మోసగించింది. వెంటనే కూటమి ప్రభుత్వం గద్దె దిగాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలోని జింఖానా మైదానంలో డిసెంబర్ 4న జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు ర్యాలీ చేపట్టారు. కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు బాలకృష్ణ, భీమేష్, చరణ్ తదితరులు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందన్నారు. నిరుద్యోగ భృతి, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ.1,500, ఉచిత బస్సు ప్రయాణం లాంటి హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రజాహక్కుల సభలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు.

రబీ అంతంత మాత్రమే!


ఒంటిమిద్ది వద్ద సాగు చేసిన వేరుశనగ పంట

మూడు నియోజకవర్గాలలో సాగు పరిశీలిస్తే..

నియోజకవర్గం	మొత్తం సాగు (హెక్టార్లలో)	ప్రస్తుతం సాగు	విత్తన ప్రతిపాదనలు (క్వింటాళ్లు)	వచ్చిన స్టాకు (క్వింటాళ్లు)
కళ్యాణదుర్గం	6709	1890	1000	500
రాయదుర్గం	1750	234	3300	9417
ఉరవకొండ	4800	3100	22000	2000
మొత్తం	13259	5224	26300	3441

- వేరుశనగ సాగుపై రైతుల విముఖత
- నేటికీ ఆర్‌ఎస్‌కేలకు చేరని విత్తనం
- గత ప్రభుత్వంలో రబీ కంటే ముందే రైతన్నలకు విత్తనాలు

కళ్యాణదుర్గం: ఈ ఏడాది రబీ వేరుశనగ సాగు ముందుకు సాగడం లేదు. గతేడాది ఈ సమయానికి రబీ పంటలు కళకళలాడేవి. ప్రస్తుతం రబీ విత్తన వేరుశనగను సకాలంలో ప్రభుత్వం రైతులకు సరఫరా చేయకపోవడంతో సాగుపై రైతన్నలు మక్కువ చూపడం లేదు. దీంతో ఈ సారి రబీ సాగు అంతంత మాత్రంగానే సాగుతోంది.

మూడు నియోజకవర్గాలలో 13259 హెక్టార్ల లక్ష్యం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 13259 హెక్టార్ల రబీ వేరుశనగ సాగు లక్ష్యం ఉంది. అయితే ప్రస్తుతం 5224 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. మూడు నియోజకవర్గాల్లో 26,300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ ప్రతిపాదనలు చేయగా ఇప్పటివరకు కేవలం 3,441 క్వింటాళ్ల విత్తనం మాత్రమే అందుబాటులో ఉంది. చాలాచోట్ల రైతు సేవా కేంద్రాలకు నేటికీ విత్తనం అందడంలేదంటే అతిశయోక్తి కాదు.

గత ప్రభుత్వ హయాంలో ముందుగానే విత్తనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రబీ సీజన్ కంటే ముందే రైతన్నలకు ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేసేది. రైతుల నుంచి వచ్చే ప్రతిపాదనలతో ముందుస్తుగా విత్తనాలు, ఎరువులను సిద్ధం చూసి ఉంచేది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. కేవలం రైతు సేవా కేంద్రాల్లో రైతుల నుంచి రబీ విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు తప్పా విత్తనాలు స్టాకు తెప్పించడం లేదని రైతులు మండిపడుతున్నారు.

అదను దాటిపోతే ఈసారి రబీ లేనట్లే..

కాగా రబీ సీజన్ నవంబర్ 15వ తేదీ నుంచి డిసెంబర్ 15 నాటి వరకు ఉంటుంది. అయితే అదను దాటిపోతే ఇక ఈ ఏడాది రబీ విత్తన వేరుశనగ సాగు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ విత్తన వేరుశనగ సైతం ఈ సారి తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో రబీ విత్తన సాగు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

డిమాండ్ మేరకు విత్తనాలు తెప్పిస్తాం



రబీ విత్తన వేరుశనగకు రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి విత్తనాలు తెప్పిస్తాం. ఇప్పటికే రైతుల అవసరాలను బట్టి గతేడాది గణాంకాల ప్రకారం సాధారణ సాగును దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికీ ఆర్‌ఎస్‌కేల ద్వారా రైతుల వద్ద నుంచి రబీ విత్తన సాగుకు రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది. త్వరలోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు విత్తనాలను అందజేస్తాం.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

రైతులకు అన్యాయం చేయొద్దు


గ్రూప్ టెంపుల్స్ ఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతులు

ఉరవకొండ: రేణుమాకులపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ భూమిని గుత్తకు సాగుచేసుకుంటున్న తమకు అన్యాయం చేయడం దుర్మార్గమని రైతులు మండిపడ్డారు. భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తూ రశీదులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రూప్ టెంపుల్స్ ఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కౌలు రైతు సంఘం నేతలు పెద్దముస్టూరు వెంకటేష్, రంగారెడ్డి, మధు మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చెందిన 9 ఎకరాల భూమిని 10 మంది రైతులు గత పదేళ్లుగా సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ఏటా పంటలు సాగు చేస్తూ ఆలయానికి గుత్తు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కంది పంట సాగుచేశారన్నారు. అయితే ఆలయ ఈఓపై కొంతమంది రాజకీయ నేతలు ఒత్తిడి చేసి రశీదులను ప్రైవేట్ వ్యక్తుల పేరుతో ఇవ్వడానికి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. కౌలు రైతులకు అన్యాయం చేసి వారి కడుపులు కొట్టాలని ప్రయత్నిస్తే దీనిపై తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు.

కబ్జాదారుల లెక్క తేలుస్తాం


సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: గతంలో నుంచి మంజూరైన ప్రభుత్వ పాత, కొత్త హౌసింగ్ లేఅవుట్లలో ప్రత్యేక టీములు ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపించి డిసెంబర్ నెలాఖరులోగా అర్హులతో పాటు కబ్జాదారుల లెక్క తేలుస్తామని తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. హౌసింగ్ లేఅవుట్లలో లబ్ధిదారుల సమస్యలపై కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, పద్మజతో పాటు మరికొందరు కౌన్సిలర్లు ప్రశ్నలు లేవనెత్తగా తహసీల్దార్‌పై విధంగా స్పందించారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత కౌన్సిల్‌లో ప్రతిపాదించిన అజెండా అంశాలను సిబ్బంది చదివి వినిపించారు. అనేక అజెండా అంశాలపై ఉన్న సందేహాలను, నిధుల కేటాయింపులపై కౌన్సిలర్లు గోవిందరాజులు, బండి అజయ్, శ్రీనివాసరెడ్డి తదితరులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏకగ్రీవంగా అజెండా అంశాలను ఆమోదించారు. తర్వాత జరిగిన జీరో అవర్స్‌లో పలువురు కౌన్సిలర్లు సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చారు. హౌసింగ్ లేఅవుట్లతో ఆక్రమణలు కాకుండా చర్యలు తీసుకుంటామని, అర్హత ఉండి నేటి వరకు నిర్మాణాలు చేయకపోతే అలాంటి వారు ముందుకొస్తే న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. వివిధ సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలి బాషా, మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు నరసింహులు, ప్రతాప్, టీపీఎస్ మురళీమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సీడీపీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం


మాట్లాడుతున్న జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ స్వామి

కూడేరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పెంపొందుతుందని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. బుధవారం కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, మధ్యహ్న భోజనం తయారీ చేసే ప్రాంతంలో పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కూడేరును బెస్ట్ స్కూల్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ చూపగలరన్నారు. మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రతి ఒక విదార్థికి వైద్య పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. వారికి కేటాయించిన హెల్త్ బుక్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఏవైనా జబ్బులుంటే మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర, ఎంహెల్‌హెచ్‌పీ కరిష్మా, హెల్త్ అసిస్టెంట్లు రమేష్, చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీడీపీఓ లక్ష్మిప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని సీడీపీఓ లక్ష్మిప్రసన్న పేర్కొన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంపై పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బాల్య వివాహంతో కలిగే అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శెట్టూరు: ఏపీని బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా మర్చుకొందామని ఎంఈఓ శ్రీధర్ అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళ సంఘాల సభ్యులు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు.

పండ్లతోటల బిల్లులు ఎప్పుడిస్తారు?

కుందుర్పి: డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద సాగు చేసిన పండ్లతోటలకు బిల్లులు మంజూరు చేయాలంటూ రైతులు ఉపాధి హామీ సిబ్బందిని నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ బిల్లులు చెల్లింపులు, డ్రైల్యాండ్ హార్టికల్చర్‌పై ఉపాధి హామీ ఈసీ ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. ఈసందర్భంగా పలువురు రైతులు తమకు నాలుగు నెలల నుంచి పండ్లతోటల చెల్లించడం లేదని ఉపాధి హామీ సిబ్బందిని నిలదీశారు. అయితే మీరంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని, టీడీపీ నాయకులు చెబితేనే బిల్లులు చేస్తామని ఈసీతో పాటు జంబుగుంపల టెక్నికల్ అసిస్టెంట్ చెప్పడంతో రైతులంతా అవాక్కయ్యారు. జిల్లా అధికారులు తమ పొలాల్లో ఉన్న పండ్లమొక్కలను పరిశీలించి నిబంధనల మేరకు బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని వారు హెచ్చరించారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం


కార్తీక దామోదర వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరాలయంలో బుధవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తీక దామోదర వ్రతం ఆచరించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాతం అందజేశారు.

నేడు కార్తీక దీపోత్సవం

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం క్షేత్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి తెలిపారు. భక్తులు హాజరై కార్తీక దీపోత్సవం, పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుని జయప్రదం చేయాలని కోరారు.

వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

- మాజీ ఎమ్మెల్యే మెట్టు డిమాండ్


కణేకల్లు చెరువుకట్టపై వరి ధాన్యం రాసులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం తక్షణమే వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. కణేకల్లు చెరువు కట్టపై రైతులు రాసులుగా పోసిన వరిని మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి బుధవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పంటకోత కోసి వరి రాసులు పోస్తే వరిధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ఎగబడేవారని రైతులు మెట్టుకు వివరించారు. ఇప్పుడా పరిస్థితి లేదని వాపోయారు. రాసులు పోసి ఐదారు రోజులవుతున్నా... కొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రావడం లేదని రైతులు ఈరన్న, వన్నూరుస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మెట్టు మాట్లాడుతూ.. ఈనెల 30న నేమకల్లు పర్యటనకు రానున్న సీఎం చంద్రబాబు ఈ ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో బహిరంగ మార్కెట్లో వరి క్వింటాలు రూ.3,100 ఉండగా... నేడు క్వింటాలు రూ.2,050 నుంచి రూ.2,100 ఉందన్నారు. క్వింటాలుకు వెయ్యి వరకు ధర తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారన్నారు. కనీస మద్దతు ధర రూ.2,350కు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి క్వింటాలు వరి ధాన్యం రూ.2,850తో కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. రబీలో సాగు చేసే పంటలకు ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని మెట్టు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మారెంపల్లి మారెన్న, వై.చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బొమ్మనహాళ్: పయ్యావుల ఆంజినేయులు మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో పయ్యావుల ఆంజినేయుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పయ్యావుల ఆంజినేయులు పార్టీ కోసం చేసిన సేవలను కొనియాడారు. మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, కేశవరెడ్డి, జయరామ్‌రెడ్డి, మురళి, వైస్ ఎంపీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటల పరిశీలన


తీటకల్లు వద్ద కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

బ్రహ్మసముద్రం: తీటకల్లులోని వ్యవసాయ పొలాలను కేవీకే శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రాయుడు, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త మాధవి, ఏరువాక కో–ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు, కత్తెర పురుగు నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. అలాగే కందిలో చీడపీడల నివారణపై పలు సూచనలు చేశారు. ఏడీఏ యల్లప్ప, ఏఓలు సరిత, జగదీశ్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలి

రాయదుర్గంటౌన్: పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరే రైతుల వాటా లేకుండా ఈ ప్రభుత్వం కూడా బీమాను అమలు చేయాలన్నారు.

జలజీవన్‌మిషన్‌తో ప్రతి ఇంటికీ నీరు

కణేకల్లు: జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని కేంద్ర కమిటీ సభ్యుడు కురుక్షేత్ర పేర్కొన్నారు. మండలంలోని 43 ఉడేగోళం గ్రామాన్ని కేంద్ర కమిటీ సభ్యులు కురుక్షేత్ర, జాలీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. నిర్దేశించిన మేరకు ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీ శ్రీనివాసులు, జేఈ శివకృష్ణారెడ్డి, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, సర్పంచు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు గుర్తించాలి


మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు

వజ్రకరూరు: ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద ఎంపిక గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, నివేదికలను అందజేయాలని డీటీడబ్ల్యూఓ (డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్) రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. బుధవారం వెంకటాంపల్లి పెద్దతండా (రూపానాయక్ తండా), వెంకటాంపల్లి చిన్న తండా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటాంపల్లి సచివాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద వెంకటాంపల్లి పెద్దతండా, వెంకటాంపల్లి చిన్న తండా గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు తదితర వాటిని పక్కగా అమలు చేసేలా ప్రణాళికలు తయారు చేసి నివేదికలు తయారు చేయడం జరుగుతుందని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి విషయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమా కమలమ్మ, ఈఓఆర్డీ దామోదర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్, పీఆర్ ఏఈ మణిభూషణ్, గ్రామ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆటోడ్రైవర్‌కు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: బోయలపల్లి సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడి ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు...కళ్యాణదుర్గం ఎస్సీకాలనీకి చెందిన రమేష్ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కంబదూరు మండల గొల్లపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి తన ఆటోలో బయలుదేరారు. బోయలపల్లి సమీపంలో టైర్ పగిలి పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టరు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుందుర్పి: మండలంలోని కుందుర్పి–మహంతపురం రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సాసులకుంటకు చెందిన ధనుంజయ మహంతపురంలో జరిగిన జాతరకు హాజరై బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మహంతపురం మిట్టపైకి రాగానే ఎదురుగా వచ్చిన తెనగల్లుకు చెందిన చాకలి లింగప్ప బైక్‌ను పరస్పరం ఢీకొన్నారు. ఘటనలో ఇద్దరికి తలలు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కంబదూరు ఎస్‌ఐగా ప్రవీణ్

కంబదూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా ఎంకె ప్రవీణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న ఆంజనేయులును పెద్దవడుగూరుకు బదిలీ చేశారు. కుప్పంలో ఎస్‌ఐగా పని చేస్తున్న ఎంకె ప్రవీణ్‌ను ఇక్కడ నయమించారు. నూతన ఎస్‌ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వేయింగ్ మిషన్లకు సీలు వేయించుకోండి

కణేకల్లు: వేయింగ్ మిషన్లకు తప్పని సరిగా సీలు వేయించుకోవాలని తూనికలు, కొలతలశాఖ అధికారి శంకర్ సూచించారు. కణేకల్లులో బుధవారం వివిధ కిరాణీ దుకాణాలతో పాటు చికెన్ సెంటర్లలో ఉన్న వేయింగ్ మిషన్లను ఆయన పరిశీలించారు. సీలు లేని 11 ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లకు సీళ్లను వేశారు. 16 తూనికల త్రాసులకు పరిశీలించి ముద్రలు వేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

శెట్టూరు: బసంపల్లి గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన ఎస్సీలు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గూబనపల్లి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, నాయకులు తిప్పేస్వామి, రామన్న, కుష్టాపురం బాబు, బసంపల్లి మహేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకులు దుర్గేష్, దేవిలాల్, చన్నమల్లప్ప, మహేంద్ర, రుద్రయ్య, ప్రకాష్, రుద్రముణి, చెలిమప్ప, జనార్ధన, దోణతిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అసాంక్రమిక వ్యాధుల సర్వే

కూడేరు: సంక్రమిత కాని వ్యాధులు క్యాన్సర్, గుండెజబ్బు, దీర్ఘకాలిక శ్వాస కోశ, షుగర్ సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. మండల వ్యాప్తంగా ఉన్న 13,392 గృహాల్లో తొలి విడతగా 13 వేల మందికి పరీక్షలు నిర్వహించేలా ఉన్నతాధికారులు లక్ష్యం నిర్దేశించారు. సర్వే ఈనెల 14 నుంచి ప్రారంభమైన సర్వే మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. సర్వేలో 10 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 11 మంది ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొంటున్నారు. రోజుకు ఒక గ్రామంలో 5 గృహాల్లో జరుగుతున్న సర్వేను సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర పర్యవేక్షిస్తున్నారు. బుధవారం నాటికి 1,600 మందిని పరీక్షించినట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.